16న మోడల్ కెరీర్ సెంటర్ వద్ద జాబ్ మేళా

రాజమహేంద్రవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో ఈ నెల 16న జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరిష్‌చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పేరుమాళ్లరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో మూడు ప్రముఖ కంపనీలు పాల్గొంటున్నాయన్నారు. ఐటిఐ, డిప్లమో, బి,టెక్, ఎంబిఎ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లో రిజస్టర్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు రెజ్యూమ్‌తో పాటూ ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇదేం బాదుడు బాబూ...

పెరిగిన విద్యుత్ ఛార్జీలతో ప్రజల బెంబేలు
సర్దుబాటు, సర్‌ఛార్జీలతో ఆర్థిక భారం

ప్రజాశక్తి - యంత్రాంగం

సాధారణంగా విద్యుత్ వాడకం తగ్గితే బిల్లులో తగ్గుదల కనిపిస్తుంది. కాని నవంబర్, డిసెంబర్ నెలల బిల్లుల్లో యూనిట్లు తగ్గినా విద్యుత్ ఛార్జీలు మాత్రం పెరిగిపోయాయి. కారణం సర్‌ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలే. వాడుకున్న కరెంటు కంటే ఈ అదనపు ఛార్జీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాడుకున్న దానికంటే రెండు మూడు రెట్లు అదనంగా కరెంటు బిల్లులు రావడంతో 'ఈ బాదుడు మేం తట్టుకోలేం బాబూ' అంటూ గగ్గోలు పెడుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వాడుకున్న కరెంటకు సంబంధించి ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలను ప్రస్తుతం వసూలు చేస్తున్నారు. ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 పేరుతో ఇవి ప్రస్తుత బిల్లుతో వస్తున్నాయి. సర్‌ఛార్జీలతో కలిసి వీటిని వసూలు చేయడంతో ప్రతి విద్యుత్ వినియోగదారునిపై ఈ భారం పడుతుంది. 15 నెలల పాటు ఈ భారం పడనుంది. నవంబర్‌లో ఎఫ్‌పిపిసిఎ ఛార్జి వసూలు చేయగా డిసెంబర్‌లో ఎఫ్‌పిపిసిఎ2ను కూడా కలిపి వసూలు చేస్తున్నారు. ఒక్కో కుటుంబం పై రూ.100 నుంచి రూ.500 వరకూ అదనపు భారం పడుతుంది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీలు గుప్పించిన కూటమి నేతలు నేడు అధికారంలోకి వచ్చిన ఆరునెలలకే సర్దుబాటు ఛార్జీల పేర భారం మోపడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేం బాదుడు బాబూ అంటూ నోళ్లు వెళ్లదీస్తున్నారు.



రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామానికి చెందిన ఎన్.ఆదిలక్ష్మి కుటుంబం ఎర్రకొండపై నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి సంబంధించి కరెంటు బిల్లు ఎప్పుడూ రూ.250 మించి రాదు. డిసెంబర్ బిల్లులో 66 యూనిట్ల కరెంట్‌ను వాడుకున్నట్టు చూపారు. కాని బిల్లు మాత్రం రూ.894 రావడంతో అవాక్కైంది.66 యూనిట్లకు ఎనర్జీ ఛార్జి 189.18 కాగా ఫిక్స్‌డ్ ఛార్జి రూ.10, కస్టమర్ ఛార్జి రూ.30, ఇడి ఛార్జి రూ.3.96, సర్‌ఛార్జి రూ.25, ఎఫ్‌పిపిసిఎ రూ.153, ఎఫ్‌పిపిసిఎ2 కింద మరో రూ.105, ఎఎఫ్‌టి పేరుతో రూ.401 వేశారు. వెరసి మొత్తం బిల్లు రూ.894 వేయడంతో ఆమె లబోదిబోమంటుంది. వాడుకున్న కరెంటుకు నాలుగు రెట్లు ఛార్జీ వేశారని వాపోతోంది

వినియోగం తగ్గినా అదనంగా బిల్లులు

చెముడులంకకు చెందిన తమ్మన శ్రీనివాస్‌కు నవంబర్ నెలకు సంబంధించి 190 యూనిట్లకు రూ.950 బిల్లు వచ్చింది. డిసెంబర్‌లో కరెంటు వాడకం తగ్గింది. డిసెంబర్‌లో 187 యూనిట్లు మాత్రమే వాడుకున్నారు. డిసెంబర్‌లో రూ.1,048 బిల్లు వచ్చింది. గతనెల కంటే మూడు యూనిట్లు తగ్గినా కరెంటు బిల్లు తగ్గక పోగా గత నెలకంటే అదనంగా రూ.98 వచ్చింది. డిసెంబర్ నెలలో సర్‌ఛార్జి రూ.25, ఎఫ్‌పిపిసిఎ రూ.86, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జి రూ.76 అదనంగా వచ్చింది. వాడుకున్న కరెంటు కంటే రూ.187 అదనంగా చెల్లించాల్సి వచ్చింది. దీనిపై శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ భారాలు వేయబోమని చెప్పి ఇప్పుడు ఇలా అడ్డగోలుగా భారాలు వేయడం సబబు కాదన్నారు.

79 యూనిట్లకు రూ.986

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంకలో కె.నాగేశ్వరావు కుటుంబం నివాసం ఉంటోంది. నవంబర్ నెలలో వీరింటికి 70 యూనిట్లకు రూ.832 బిల్లు వచ్చింది. ఇందులో సర్‌ఛార్జి రూ.150, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జి రూ.34 వేశారు. డిసెంబర్‌లో 79 యూనిట్ల కరెంట్ వాడుకున్నారు. దీనికి రూ.986 బిల్లు వచ్చింది. ఇందులో సర్‌ఛార్జి రూ.150, ఎఫ్‌పిపిసిఎ 72, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జి రూ.34 వేశారు. యూనిట్ల పరంగా వాడుకున్న 79 యూనిట్లకు రూ.491.85 అయితే అదనంగా రూ.494.15 పడింది. అసలు వాడుకున్న దానికంటే కొసరు ఛార్జీలే అధికంగా ఉండటంతో లబోదిబోమంటున్నాడు.

32 యూనిట్లు తగ్గినా బిల్లులో మాత్రం మార్పు లేదు

ఆలమూరు మండలంలోని మడికిలో గంగిశెట్టి దొరబాబు నివాసం ఉంటున్నారు. ఆ ఇంటికి అక్టోబర్ నెలకు కరెంటు బిల్లు 215 యూనిట్లగాను 1139 రూపాయలు వచ్చింది. అలాగే డిసెంబర్ నెల విద్యుత్ బిల్లు 183 యూనిట్లకు గాను 1138 రూపాయలు వచ్చింది. అయితే విద్యుత్ వినియోగం తగ్గిన బిల్లు యధాతధంగా రావడంతో వారు ఆవేదన చెందుతున్నారు.

స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేద్దాం

జెసి చిన్న రాముడు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్వర్ణాంధ్ర-2047 దిశగా అడుగులు వేద్దామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆనం కళా కేంద్రంలో జరిగిన స్వర్ణాంధ్ర 2047' ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా అధికారులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర-2047ను విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధి లక్ష్యం రాష్ట్ర స్థాయిలో దిశా నిర్దేశనం చేశారన్నారు. అందులో భాగంగా పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత , రైతు - వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్) , శక్తి, ఇంధనాల వ్యయ నియంత్రణ అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వర్ణాంధ్ర సాధనకు అందరకూ ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి డిఎస్.భాస్కర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి నర్సరీలో థాయ్‌లాండ్ మొక్కల పెంపకం

ప్రజాశక్తి- కడియం

పలు రకాలు థాయిలాండ్ పండ్ల మొక్కలకు నిలయంగా మారింది బుర్రిలంకలోని సప్తగిరి నర్సరీ. కొన్నేళ్లుగా థాయిలాండ్ నుంచి అనేక రకాలు మొక్కలను దిగుమతి చేసుకుని వాటికి అంట్లు కట్టి ఇక్కడ వాతావరణానికి అనుగుణంగా తీర్చి దిద్దుతున్నారు సప్తగిరి నర్సరీ రైతు కుప్పాల దుర్గారావు. అనంతరం ఇక్కడి నర్సరీ రైతులకు తక్కువ ధరలకు వెరైటీ పండ్ల మొక్కలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే తరహాలో మరో నూతన 'పసుపు రంగు సీతాఫలం' పండ్ల పంటను అందుబాటులోకి తెచ్చారు. మూడేళ్ల క్రితం థాయిలాండ్ నుంచి మొక్కను తెచ్చిన దుర్గారావు ఇక్కడి వాతావరణానికి అనుగుణంగా పెంచి పోషించారు. ఆ మొక్క ఇప్పటికి పెరిగి పెద్దదై కాయలు కాయడంతో పాటుగా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రైతు దుర్గారావు మాట్లాడుతూ ఈ సీతాఫలం సంవత్సరానికి రెండుసార్లు దిగుబడిని ఇస్తుందన్నారు. లోపల గుజ్జు ఎంతో రుచిగా పోషకాలు కలిగి ఉంటుందని తెలిపారు. అలాగే ఇప్పటికే అంట్లు కట్టడం ద్వారా కొన్ని మొక్కలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

నర్సరీలో పండించిన థాయ్ సీతాఫలం

రాజగోపాల్‌కు నివాళి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎపిటిఎఫ్ (257) రాష్ట్ర పూర్వ కార్యదర్శి సూర్యారావు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాజీ హెచ్‌ఎం అయినపర్తి రాజగోపాల్ మృతికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం సూర్యారావుపాలెం పాఠశాలలో సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత రాజగోపాల్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం హెచ్‌ఎం జాన్ ప్రకాష్ మాట్లాడారు. రాజగోపాల్ మరణం ఎపిటిఎఫ్‌కు తీవ్ర లోటు అన్నారు. సర్పంచ్ మెండే లలితకుమారి, ఉప సర్పంచ్ నందిన శ్రీనివాసరావు రాజగోపాల్ నివాసానికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ రాజగోపాల్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

బ్రాహ్మణ గూడెంలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో శుక్రవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో తహశీల్దార్ ఎం.మెరికమ్మ పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, గారపాటి బాబూరావు, ప్రతిపాటి సుబ్బారావు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదు అందినట్లు తహశీల్దార్ తెలిపారు

కార్టూ'నిజం'



'నన్నయ'లో అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ కం యూనివర్సిటీ సెలక్షన్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జి.సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. తొలుత జాతీయ జెండా, స్పోర్ట్స్ జెండా, యూనివర్సిటీ జెండాలను ఎగురవేశారు. క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలకు హాజరైన 250 మంది క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి మూడు విభాగాల్లో మొత్తం 24 ఈవెంట్స్‌లో మెన్ అండ్ ఉమెన్ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు నన్నయ విశ్వవిద్యాలయం చక్కని వేదిక అవుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని నిర్వాహకులను అభినందించారు. అనంతరం విజేతలకు మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్‌వర్మ, ఎన్.ఉదయ్ భాస్కర్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ కొండ్రు సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చొల్లంగి వెంకట సుబ్రహ్మణ్యం, అబ్జర్వర్ సాల్మన్ దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

విజేతలు వీరే...

హాఫ్ మరాథాన్(ఉమెన్స్‌లో) గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్‌జిసిపిఇ కళాశాల విద్యార్థిని జి.పావని, కాకినాడ ఎఎస్‌డి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థిని ఎస్.సౌమ్యశిరీష, గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్‌జిసిపిఇ కళాశాల విద్యార్థిని బి.నాగలక్ష్మిదుర్గ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

మెన్స్ విభాగంలో తణుకు ఎస్‌సిఐఎండిసి విద్యార్థి బి.సురేష్, భీమవరం డిఎన్ఆర్ కాలేజ్ విద్యార్థి ఎ.మోహన్‌కృష్ణప్రసాద్, భీమడోలు కళాశాల విద్యార్థి పి.సాయిరామ్ వరుసగా మొదటి మూడుస్థానాల్లో నిలిచారు.

డిస్కస్ త్రో(ఉమెన్)లో గోపన్నపాలెం ఎస్-ఎస్ఆర్‌జిసిపిఇ కళాశాల విద్యార్థిని సిహెచ్.శోభారాణి, నన్నయ యూనివర్సిటీ విద్యార్థిని ఎస్.శ్రీలక్ష్మీలావణ్య, గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్‌జిసిపిఇ కళాశాల విద్యార్థిని కె.శ్రీదేవి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

5వేల మీటర్ల వాకింగ్(ఉమెన్స్)లో వి.నాగలక్ష్మి, సిహెచ్.ఝాన్సీ దుర్గ, ఎస్.పుష్పలత విజేతలుగా నిలిచారు. పురుషుల విభాగంలో బి.జీవన్‌కుమార్, యు.భీమయ్య, ఎస్.హేమసాయి విజేతలుగా నిలిచారు.

క్రీడాకారుల గౌరవవందనాన్ని స్వీకరిస్తున్న రిజిస్ట్రార్

ఎంఎల్‌ఎ నెహ్రూకు అధ్యాపకుల సన్మానం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి దోహం చేస్తున్న ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను అధ్యాపకులు శుక్రవారం ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద గోకవరం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కెఎస్.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాపక బృందం ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను కలిశారు. ఆయాన్ని శాలువాతో సత్కరించి వెంకటేశ్వర స్వామి రజిత విగ్రహాన్ని జ్ఞాపికగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలో బుక్స్ పంపిణీ నిమిత్తం ఎంఎల్‌ఎ కళాశాలకు వచ్చారన్నారు. రోడ్లు చూసి వెంటనే సిమెంట్ రోడ్లు వేయించారన్నారు. అలాగే కళాశాల ప్రహరీ, గ్రౌండ్ ఫిల్లింగ్ చేయించాలని కోరారు. దీనికి ఎంఎల్‌ఎ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ, సిద్ధా పవన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను సత్కరిస్తున్న అధ్యాపకులు

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

2030 నాటికి ప్రభుత్వాన్ని నిర్దేశించిన లక్ష్యాలను అభివృద్ధిని సాధించే విధంగా' సుస్థిర అభివద్ధి లక్ష్యాలు' పేరుతో మండల స్థాయి అధికారులకు గ్రామ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. మొదటిరోజు శిక్షణ తరగతుల్లో ఎంపిడిఒ రమణ పాల్గొని మాట్లాడగా రెండో రోజు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆఫీసర్ ఎం.చక్రపాణి, డిపిఆర్‌సి జిల్లా కో-ఆర్డినేటర్ జి.ప్రసంగిరాజు గ్రామాల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎంపీడీవో రమణ ఇఒపిఆర్డిప్రజలకు అన్ని వసతులు కల్పించడంతోపాటు ఇఒపిఆర్‌డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఎపిఎం, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అధ్యక్షతన శుక్రవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన మొదటి బ్యాచ్ రెండు రోజుల ట్రైనింగ్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం : సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఉమ్మడి కృషితో అవసరమని ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమం మొదటి బ్యాచ్ 89 మందికి శిక్షణ ముగిసిందన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులు, అధికారులు, సచివాలయ సిబ్బంది

ఆడపిల్లలను చదివిద్దాం...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నయీ చేతన3.0 లింగ ఆధారత హింస గురించి జాతీయ స్థాయిలో ప్రచారం కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మహిళా సాధికారత విభాగం తరపున 'బాల్యవివాహాలు వద్దు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివిద్దాం' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారని ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. మహిళా సాధికారత విభాగం భాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేఖ, హాస్టల్ డిప్యూటీ వార్డెన్ భవాని, దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రతి గ్రామపంచాయతీ 2025-26 ప్రణాళికను సిద్ధం చేసుకుని, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే దిశగా సచివాలయాల సిబ్బంది పని చేయాలని ఎపిఎస్ఐఆర్‌డి డిప్యూటీ డైరెక్టర్ జివి.రమణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదరికం లేని మెరుగైన జీవనం, ఆరోగ్యవంతమైన, బాలహిత, హరిత గ్రామాల ఏర్పాటు, వంటి తొమ్మిది థీమ్స్‌కు నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రతి ఒక్కరు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఇఒపిఆర్‌డి కె.ఆంజనేయశర్మ, సిహెచ్‌ఒ ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఆర్.దుర్గాభవాని, హౌసింగ్ ఎఇ బి.ఏడుకొండలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - బిక్కవోలు

ఈ నెల 17 18 తేదీల్లో బిక్కవోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌జిఎస్ఎ కార్యచరణ ప్రణాళిక2025 -26పై శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపిడి వి.శ్రీనివాస్ తెలిపారు. సుస్థిరమైన స్థిరమైన అభివద్ధి లక్ష్యాలపై శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

భూ సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రైతులు తమ వ్యవసాయ భూములకు సంబంధించి రీ సర్వే ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. రెవెన్యూ సదస్సులు రెండవ రోజు మండలంలోని కాల్దరిలో నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ పాల్గొని మాట్లాడారు. రైతుల నుంచి రెండు ఫిర్యాదులు రాగా ఒక ఫిర్యాదును తక్షణమే పరిష్కరించినట్లు తెలిపారు. రైతులకు పలు సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకాలువ ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎర్రకాలువ ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని ఎంపీ పురంధేశ్వరి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 377 రూల్ ప్రకారం లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇచ్చి, రికార్డు చేయించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన కొంగువారిగూడెం గ్రామంలో శ్రీ కరాటం కష్ణమూర్తి ఎర్రకాలువగా పిలిచే ఈ ప్రాజెక్ట్ 1976లో ప్రారంభమందన్నారు. అప్పటి నుంచి 24,700 ఎకరాల భూమి సాగుకి దోహదపడుతోందన్నారు. ఈ ప్రాజెక్ట్ 185 కిలోమీటర్లు విస్తరించి ఉప్పుటేరులో కలుస్తుందన్నారు. 2018లో వచ్చిన తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు ఈ ప్రాజెక్ట్ మౌలికసదుపాయాల్లో ఉన్న లోపాలను వెలుగులోకి తెచ్చాయన్నారు. వరదనీరు రిజర్వాయర్ సామర్థ్యాన్ని మించి రావడంతో పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. ఇటీవల వచ్చిన వరదలకూ ఇదే పరిస్థితి వచ్చిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆధునికీకరణ పనులు చేపట్టాలని కోరారు.


సర్పంచ్ శిరీషతో తానేటి వనిత, నాయకులు

సర్పంచ్ శిరీష వివాహానికి మాజీ మంత్రి వనిత హాజరు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం సర్పంచ్ పైడి శిరీష వివాహానికి మాజీ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత శుక్రవారం హాజరై ఆమెను దీవించారు. చిన్న వయసులో సర్పంచ్‌గా సేవలందించడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి వెంట ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యురాలు కాకులపాటి లలిత, ఉపసర్పంచ్ ముల్లంగి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు వెలగా శ్రీరంగమూర్తి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రముఖులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతతో అవస్థలు

- సరిపడా గదులు లేక ఇబ్బందులు
- హిందీ టీచర్ లేక పూర్తికాని సిలబస్

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని గొప్పలు చెప్పే పాలకుల మాటలు నీటి మూటలు గానే మిగిలిపోతున్నాయి. ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలే దీనికి నిదర్శనం.

చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకూ విద్యాబోధన జరుగుతుంది. ఈ పాఠశాలలో 318 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు 57 మంది వరకూ ఉన్నారు. ఇప్పటికే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు టైమ్ టేబుల్ కూడా విడుదలైంది. మార్చి నెలలో వారు పరీక్షలు రాయాల్సి ఉంది. అయితే ఇక్కడ నేటికీ హిందీ టీచర్ లేరు. దీంతో సిలబస్ పూర్తికాలేదు. పదో తరగతి విద్యార్థులకూ సిలబస్ పూర్తికాకపోవడంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. ఈ పాఠశాలకు రెండు హిందీ టీచర్ పోస్టులు మంజూరయ్యాయి. ఉపాధ్యాయుల కొరతతో ఒక హిందీ టీచర్‌నే నియమించారు. గతేడాది ఆగస్టు నెలలో ఆయన కూడా బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇక్కడ హిందీ టీచర్‌ను నియమించలేదు. ఈ ప్రభావం పదోతరగతి విద్యార్థులపై ఎక్కువగా ఉంది. గతేడాది హిందీ మాస్టారు లేకపోవడంతో విద్యార్థులు అత్తెసరమార్కులతోనే గట్టెక్కారు. అన్ని సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు వచ్చినప్పటికీ హిందీ సబ్జెక్టులో మాత్రం పాస్ మార్కులు మాత్రమే రావడంతో మార్కులు తగ్గిపోయాయి. ప్రస్తుత విద్యాసంవత్సరం కూడా ఇదే పరిస్థితి ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా మండలంలోని ఇతర పాఠశాలల్లోనూ ఉపాధ్యాయుల కొరత ఉంది. నాగులు ఉన్నత పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు లేరు. ఎలిమెంటరీ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

తరగతి గదుల కొరత

చిట్యాల హైస్కూల్లో 318 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగు గదులు గల భవనాలు సుమారు 36 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. స్లాబు పెచ్చులూడి పడటంతో నాలుగు తరగతి గదులను వినియోగించట్లేదు. దీంతో విద్యార్థులను సైన్స్ ల్యాబ్, స్టాల్ ల్యాబ్, లైబ్రరీ, బిసిఆర్ రూమ్‌లలో కూర్చోబెట్టి తరగతులను నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఫేస్2 నాడునేడులో ఆరు అదనపు తరగతి గదులను మంజూరు చేశారు. ప్రస్తుతం అవి నిలిపేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో ఇరుకు గదుల్లోనే వారు పాఠాలు నేర్చుకుంటున్నారు.

హిందీలో విద్యార్థులు వెనుకబడుతున్నారు

హిందీ టీచర్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ఈ సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ఏదో విధంగా ఇతర ఉపాధ్యాయులతో హిందీ సిలబస్‌ను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆ సబ్జెక్టుపై ఇతర ఉపాధ్యాయులకు పట్టు తక్కువగా ఉండటంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి అనేక మార్లు ఈ విషయాన్ని తీసుకెళ్లాను. పాఠశాలలో ఆరు అదనపు తరగతి గదులు అవసరం ఉంది..

- కె.శ్రీనివాసరావు, హెచ్‌ఎం

హిందీ సబ్జెక్ట్ క్లాసులు జరగడంలేదు

ఇప్పటి వరకు హిందీ సిలబస్ ప్రారంభించలేదు. ఇప్పటి వరకూ పాఠశాలలో నిర్వహించిన హిందీ పరీక్షల్లో ఏం రాసామో కూడా తెలియదు. పబ్లిక్ పరీక్షల్లో హిందీ సబ్జెక్టులో ఫెయిల్ అవుతానేమో అని భయం వేస్తుంది. ఇప్పటికైనా హిందీ టీచర్‌ను నియమించాలి.

- పిల్లి దీపిక, 10వ తరగతి విద్యార్థిని

టీచర్ లేకుండా ఎలా చదవాలి

ప్రస్తుతం పాఠశాలలో హిందీ టీచర్ లేరు. ఒక్క పాఠం కూడా చెప్పలేదు. ఎలా చదవాలో.. ఏం చదవాలో తెలియడం లేదు. ఇలా అయితే పబ్లిక్ పరీక్షలు ఎలా రాయాలో అర్థం కావడం లేదు. చేసేది లేక గైడ్లు కొనుక్కుని బట్టీ పట్టాల్సి వస్తుంది. ఎ

- జగత సూర్యప్రకాష్, 10వ తరగతి విద్యార్థి

ఉన్నతాధికారులకు నివేదించాం...

మండలంలో పలు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదించాం. చిట్యాల హైస్కూల్లో హిందీ టీచర్ లేరనే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లాము. విద్యార్థుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాను.

- ఎ.ఉమామహేశ్వరరావు, ఎంఇఒ-2

నేరాలు ఘోరాలు

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - రాజోలు

ప్రమాద ఘటనలో గాయపడిన యువకుడి చికిత్స పొందుతూ మృతి చెందాడని శుక్రవారం పోలీసులు తెలిపారుర. రాజోలు మండలంలో సోంపల్లి శివాలయం సమీపంలో గురవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలోశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు కు చెందిన కొరత్తిక బాబి(కార్తీక్) గాయపడ్డాడు. చికిత్స కోసం అతనిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాబి సొంత పనులని మిత్తం బైక్ పై మండపేట వెళ్లి తిరిగి వస్తుండగా ఈప్రమాదం జరిగింది. ఈ ఘటనపై మృతుని తల్లి దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ కుమార్ తెలిపారు.

సారా విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

సర్కిల్ పరిధిలోని నాటు సారా విక్రయిస్తున్న వారిపై ఆలమూరు ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని క్రవారం అరెస్ట్ చేశారు. మండలంలోని మడికికి చెందిన యు.శాంతకుమారి, మండపేట మండలంలోని ఏడిదకి చెందిన యార్లగడ్డ వీరవేణిలు నాటు సారా విక్రయిస్తుండగా మొత్తం 10 లీటర్ల సారాతో అదుపులోకి తీసుకున్నామని ఆలమూరు ఎక్సైజ్ సిఐ ఐడి నాగేశ్వరరావు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను ఆలమూరు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా వారికి ఆయన రిమాండ్ విధించారు. ఈ దాడుల్లో సిఐ నాగేశ్వరరావు తోపాటు ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ నోట్ల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - అమలాపురం

నకిలీ కరెన్సీ నోట్లు తయారుచేసి, చలామణీ చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.లక్షా 33,500 నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారని జిల్లా ఎస్‌పి బి. కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలోని వీరవల్లి కేంద్రంగా 12 మంది ముఠా సభ్యులుగా ఏర్పడి నకిలీ కరెన్సీ నోట్ల ముద్రణ చేస్తూ ఆ నోట్లను చలామణీ చేస్తున్నారని తెలి పారు. ఈ నకిలీ కరెన్సీ ప్రింటింగ్‌కు వాడిన ప్రింటర్లు, ల్యాప్‌టాప్, ఇతర పరికరాలను నిందితుల నుండి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.. నకిలీ కరెన్సీ నోట్ల ముఠాలో ప్రధాన నిందితులు రాజోలు మండలం తాటిపాక మఠంకు చెందిన పాస్టర్ కోళ్ళ వీర వెంకట సత్యనారాయణ, అనపర్తికి చెందిన సత్తి వీర రాఘవ రెడ్డి, కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన షేక్ మస్తాన్‌లను అరెస్టు చేసిన పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి దొంగ నోట్లు ముఠా అరెస్టుకు కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్‌పి కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడలో శుక్రవారం ఎరువులు పురుగు మందుల షాపులపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్‌లో ఎరువుల అమ్మకాల్లో బుక్ బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్ తేడాలు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేశారు. గంగా ట్రేడర్స్ దుకాణంలో వివిధ రకాల మందులను సీజ్ చేశారు. విజిలెన్స్ సిఐ టిఎన్‌వి.రాజు, తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ పి.సరోజిని ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కెవివి.సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అన్ని కోర్టుల్లో ఈ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెంకటేశ్వరరావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - అల్లవరం

గద్దర్ జాతీయ సేవా పురస్కారం అందు కున్న గోడి బాలుర గురుకుల పాఠశాల ఆర్ట్స్ ఉపాధ్యాయులు మద్దా వెంకటేశ్వరరావుకు శుక్రవారం పలువురు అభినందలు తెలియజేశారు. పి.గన్నవరం మండలం మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యమంలో పి.గన్నవరం ఎంఎల్‌ఎ సభ్యులు గిడ్డి సత్యనారాయణ, స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు కోరుకొండ జాన్ తెలంగాణ సాంస్కృతిక సారథి, గద్దర్ కుమార్తె వెన్నెల, మాజీ ఎంఎల్ఎ పాములు రాజేశ్వరి దేవి పాల్గొని వెంకటేశ్వరరావుకు గద్దర్ జాతీయ సేవ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావుకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారిని టి.ఉమాదేవి పాఠశాల అపెక్స్ కమిటీ సభ్యులు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, గోడి గ్రామ సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపిటిసి సభ్యురాలు కాండ్రేగుల వాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా వైసిపి పోరుబాట

బొమ్మూరు నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంఎల్ఎలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, నాయకులు గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి విజయలక్ష్మి, ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిల రెడ్డి తదితరులతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని రుజువవుతోందన్నారు. అన్నదాతకు అండగా వైసిపి నిలిచిందన్నారు. ధాన్యానికి గిట్టుబాటు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. లక్ష్యాన్ని మించి దిగుబడి సాధించినా రైతుల వద్ద దళారులు తక్కువ ధరకే ధాన్యాన్ని కొంటున్నారన్నారు.

ధాన్యం బస్తాలు మోస్తూ నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

రూ.1,750 గిట్టుబాటు ధర ఇస్తామని ప్రభుత్వం చెప్తుంటే దళారులు మాత్రం రూ.1,300 లకే కొనుగోలు చేస్తున్నారన్నారు. తక్షణం పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఖరి కారణంగా 75 కేజీలు బస్తాకు రైతులు రూ.400 నష్టపోతున్నారన్నారు. ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందడం లేదని రైతుల ఆందోళనలో ఉన్నారన్నారు. మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచేసిందన్నారు. నమ్మించి దగా చేయడంలో చంద్రబాబు నాయుడుకు అలవాటే నన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మరోసారి మోసం చేసిన ఆయనకు ప్రజా తిరుగుబాటును ఎదుర్కొనక తప్పదన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ నాడు వైఎస్ఆర్ వ్యవసాయ రంగానికి పెద్ద పీఠం వేస్తూ రైతులకు తోడుగా ఉన్నారన్నారు. ఆయన ఆశయాలను జగన్ అమలు చేశారన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరిట మార్క్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే సాయం కాకుండా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని చెప్పి పైసా కూడా విదల్చలేదన్నారు. మాజీ ఎంఎల్ఎలు సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు మాట్లాడుతూ చంద్రబాబు మోసం మరో మారు రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం జరుగుతాయని ఇరిగేషన్ శాఖ ఎఇ రాహుల్ భాస్కర్, రెవెన్యూ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో 11 చెరువులు కొవ్వూరు పాడు -2, కరిచర్లగూడెం-2, భీమోలు-2, గోపాలపురం-1, నందిగూడెం-1, గుడ్డిగూడెం-1, గంగోలు-1 రాంపాలెం-1, ఉన్నట్లు తెలిపారు. మొత్తం రైతులు ఓట్లు 2,513 ఉన్నాయన్నారు. అందులో మహిళలు 931, పురుషులు 1,582 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి న్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇప్పటికే దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. ంవెన్యూ , జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు.

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలో రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నఈ సదస్సుల లక్ష్యం నెరవేరకుండా పోతుంది. భూములకు సర్వే నెంబర్లు బదులుగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌పిఎం నెంబర్లతో రైతుల పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ సదస్సులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుంది. అయితే మండలంలో రెవెన్యూ సదస్సులపై విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. కాని ఇలాంటి ప్రచారం లేకుండానే సదస్సులు నిర్వహిస్తున్నారు. దీంతో సదస్సులకు రైతుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. రైతులకు రీసర్వే, ఎల్‌పి నెంబర్లపై పెద్దగా అవగాహన లేకపోవడం వల్ల కూడా సదస్సులు విజయవంతం కావడం లేదు. ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. సరైన హాజరు లేకపోవడంతో సదస్సులను ముందుగానే ముగించి చేతులు దులిపేసుకుంటున్నారు.

కోటిలో 3.30 గంటలకు ముగిసిన సదస్సు

గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారం..

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజలు తమ భూ సమస్యలను రెవెన్యూ గ్రామ సభల ద్వారా తక్షణం పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రవీందర్‌నాథ్ అన్నారు. రెవెన్యూ గ్రామసభల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు అన్నదేవరపేట సచివాలయం వద్ద గ్రామ సభ జరిగింది. ఈ గ్రామ సభలో భూ సమస్యల పరిష్కారానికి తొమ్మిది దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ సర్వేయర్ సత్యనారాయణ, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

నవవధువుకు పెళ్లికానుక అందజేత

ప్రజాశక్తి-గోకవరం

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నవ వధువుకు పెళ్లి కానుకగా రూ.20వేలను టిడిపి నాయకులు అందించారు. వెదురుపాకలోనిజాగరపు శ్రీను ధనలక్ష్మి దంపతుల కుమార్తె వీరతేజకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ నియోజవర్గ నవ వధువులకు సహాయం అందించే కార్యక్రమంలో భాగంగా వీటిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి పిల్లా అర్జున్‌సారథి, టిడిపి నాయకులు ఎస్.బాబు, గొర్రెల శ్రీను, వీర అప్పారావు, సిద్ద పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

సమాజంలో ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలని స్థానిక ప్రాంతీ య ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ శంకర్రావు పిలుపునిచ్చారు శుక్రవారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి నందు జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే వారోత్సవాల సందర్భంగా హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్, దుప్పట్లు, చీరలు స్థానిక పట్టణ పరిధిలోని ప్రముఖుల ద్వారా సేకరించి పంపిణీ చేశామన్నారు. ఈ ఈ సందర్భంగా డాక్టర్ శంకర్రావు మాట్లాడుతూ ఎయిడ్స్ అంతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. అందరికీ ఆరోగ్యం, గౌరవాన్ని భరోసా ఇవ్వాలన్నారు. జిల్లాని ఎయిడ్స్ రహితంగా మార్చా లని ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నా రు. ప్రభుత్వ వైద్యశాలల్లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నా మన్నారు. ఎఆర్‌టి సెంటర్ల ద్వారా హెచ్ఐవి చికిత్స కు మందులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. రోగులు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు. ఫెసిలిటీ సెంటర్లల్లో వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు పంపిణీ చేస్తూ ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొట్టాల్సిన బాధ్య త అందరిపై ఉన్నదన్నారు. ప్రజలకు ఎయిడ్స్ వ్యాప్తిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ పరిమితిని తగ్గించుటకు కృషి చేసున్న సిబ్బందిని, అత్యుత్తమ సేవలు అందిం చిన ఎన్‌జిఒలకు, హెల్త్ వర్కర్లను అభినందించారు. కార్యక్రమంలో అల్లాడిస్వామి నాయుడు, స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మాజీ మండల పరిషత్ అధ్యక్షులు బొర్రా ఈశ్వరరావు, అదనపు డిఎం డిహెచ్ఒ డాక్టర్ భరత లక్ష్మి, డాక్టర్ అనూష దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. వివిధ సంస్థలు దాతలు, చందన బ్రదర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఇచ్చిన దుప్పట్లు, చీరలు వలవల శివరావుచే పంపిణీ చేశారు. పోలిశెట్టి యేసు, భీమేశ్వర బజార్ వారిచే పౌష్టికాహార కిట్లు, జల్లి సుజాత వారిచే చీరలు పంపిణీ చేశారు లింగోలు పండు నాయకులు భోజనం ఏర్పాటు చేశార. కార్యక్రమంలో నల్ల రాంబాబు ఏరియా ఆసుపత్రి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ శంకర్రావు

తెలుగు ప్రతిభ పోటీల్లో సుదీప్‌కు తృతీయ బహుమతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

హైదరాబాదులో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభ పోటీల్లో తాళ్లపూడి మండలం పోచవరం గ్రామానికి చెందిన దాకే సుదీప్ తతీయ బహుమతి సాధించాడని తండ్రి రాజు తెలిపారు. కొవ్వూరులోని అభ్యాస పాఠశాలలో చదువుకుంటున్న తమ కుమారుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడమే కాకుండా తృతీయ బహుమతి సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడని తెలిపారు.



జనవరి 12న బాడీబిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - అమలాపురం

స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 12న అమలాపురంలో కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో మొట్టమొదటి యునైటెడ్ డిస్ట్రిక్ట్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెంట్ ఒంటెద్దు వెంకన్న నాయుడు తెలిపారు. శుక్రవారం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ లో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎనుముల కృష్ణ పద్మరాజు అధ్యక్షతన ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. సెక్రెటరీ కంకిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోటీలకు అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ పోటీలను నాలుగు విభాగాలుగా మొత్తం 10 కేటగిరీల్లో నిర్వహిస్తా రన్నారు. విజేతలకు నగదు పురస్కారాలు, మెరిట్ సర్టిఫికెట్, మెడల్, నేషనల్ షీల్డు బహూ కరిస్తార న్నారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గారపాటి చంద్రశేఖర్, కాంపిటీషన్ ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్స్ మట్టపర్తి సముద్రం, నార్ని శ్రీను, చిక్కం రాజబాబు పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

'చలో గుంటూరు' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం

రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విడదీసే కుట్రలు చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టేందుకు మాలలు ఐక్యంగా ఉద్యమించాలని అమలాపురం మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ అన్నారు. ఈ నెల 15న గుం టూరులో జరిగే మాల మహా గర్జనను జయప్రదం చేయా ఆయన పిలుపునిచ్చారు. 22 మండలాల మాల ముఖ్య నాయకులతో స్థానిక ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హర్షకుమార్ మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా మందకృష్ణను అడ్డుపెట్టుకొని పాలక ప్రభుత్వాలు కోర్టులను సైతం ప్రభావితం చేస్తూ ఎస్సీ వర్గీకరణ చేసేందుకు తాపత్రయం పడుతు న్నాయని ఆరోపించారు. ఇది అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆర్టికల్‌లోని 341 కు వ్యతిరేకమని షెడ్యూ ల్ కులాలందరూ ఐక్యంగా జీవించాలని అంబేద్కర్ కోరుకున్నారని తెలిపారు. నేటి పాలక ప్రభుత్వాలు మాలలకు, ఎస్‌సిలోని ఇతర కులాలకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. మాలల ఐక్యతకై వారి సమస్యల పరిష్కారానికి ఈనెల 15న గుంటూరులో మాలల మహాగర్జన నిర్వహిస్తున్నారనిదీనికి అంబేద్కర్ కోనసీమ జిల్లా నలుమూలల నుండి మాలలంతా వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు డిబి.లోక్, జంగా బాబురావు, ఇసుకపట్ల రవిబాబు, రేవు తిరుపతిరావు, గడ్డం సురేష్ బాబు, పొలమూరి మోహన్, పెనుమాల చిట్టిబాబు, ఉండ్రు ఆశీర్వాదం తదితర నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఉప్పలగుప్తం: గుంటూరు నల్లపాడు లో ఈనెల 15న జరిగే మాలల మహాగర్జన విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం దళిత సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు అధ్యక్షతన మాల మహానాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సాధన సమితి జిల్లా కన్వీనర్ జంగా బాబురావు మహాగర్జనకు జిల్లాల నుంచి బయలుదేరే అంశాలపై చర్చించారు. అనంతరం మాలల మహాగర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, అమలాపురం నియోజకవర్గ బిఎస్‌పి ఇన్‌ఛార్జ్ పొలమూరి మోహన్ బాబు, మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

డాక్యుమెంట్ పడిపోయినది

పి గన్నవరం మండలం , కుందాలపల్లి పి.వి.పాలెం గ్రామ కాపురస్తులు దాశిరెడ్డి దొరబాబు తండ్రి: వీర రాఘవులు, డోర్ నెంబర్ 2-26-1, డాక్యుమెంట్ నెం: **877/1983**, సర్వే నెంబర్ **55-4** గల **0.20** సెంట్ల భూమికి సంబంధించిన డాక్యుమెంట్ కుందాలపల్లి నుండి పి.గన్నవరం సెంటర్ కు జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయినది. దొరికిన వారు దయచేసి ఈ క్రింది అడ్రసు కి అందజేయగలరు .

దాసిరెడ్డి దొరబాబు
తండ్రి: వీర రాఘవులు, డోర్ నెంబర్ 2-26-1
పి.వి.పాలెం ,కుందాలపల్లి పిన్: 533229.
పి.గన్నవరం మండలం
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
ఫోన్: 7569131555.

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S.18/2024

కుదుపూడి ఝాన్సీ లక్ష్మి మరియు ఇతరులు ...వాదులు
మరియు
D3:వాసంశెట్టి భరత్ కుమార్ S/o.late మాధవరావు వయసు 44 సంవత్సరములు, వేమవరప్పాడు ,అమలాపురం మండలం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ...3వ ప్రతివాది

పై నెంబరు దావా లో 3వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా సమన్లు పంపగా మీరు ఉద్దేశ్య పూర్వకముగా తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన చేయడమైనది. ఈ దావా వాయిదా ది. **21-01 -2025** తేదీన ఉన్నది. కావున ఆరోజు మీరు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని ఉదయం **10:30** గంటలకు కోర్టులో హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

శ్రీ కోర్టు వారి అనుమతితో
కాండ్రేగుల వర ప్రసాద్
అమలాపురం, అడ్వకేట్
అమలాపురం 12-12-2024 సెల్:9393003681

CHANGE OF NAME

I. KADHIRI GURUMURTHY (old Name) s/o Satyam, R/O D.NO. 48-7-1, kambala Vari street Jagannaickpuram, Kakinada urban, Kakinada District, A.P state 533002, have changed my name from **KADHIRI GURUMURTHY** (old name) to **KADIRI GURUMURTHY** (New name) Henceforth, I shall be known as **KADIRI GURUMURTHY** for all purposes

IN THE COURT OF THE HON'BLE VI^th ADDITIONAL DISTRICT JUDGE, KAKINADA
I.A. No.597/2016 in O.S.No.145/2016
Between:
Ummidi Subbarao ...Petitioner/Plaintiff
and
1) Obilisetti Suryanarayana Murthy (died) and others ...Respondents/Defendants
To: Respondents/Defendants:
2: Obilisetti Satyavathi, W/o. (late) Suryanarayana Murthy, aged 68 years, House wife, R/o. D.No.29-1-20, Cinema Road, Kakinada.
4: Batchu Naga Ratna Kumari, W/o. Appla Swamy, aged 45 years, House wife, R/o. D.No.4-1-56, Cinema Road, Kakinada.

పై నెంబరు పిటిషన్/దావాలో 2వ మరియు 4వ రెస్పాండెంట్స్/ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు/సమన్లు పంపించినను తీసుకొనక ఉద్దేశ పూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు మీ హాజరు నిమిత్తం **30-12-2024** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను లేనియెడల పై పిటిషన్/దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
M.MOHAN KUMAR
Advocate & Notary
#9-285, Gopikrishna Colony, Turangi, Kakinada Rual - 533016
Cell: 9989154470